క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

అమరచింత: మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వినయ్ తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల సంచిని సబ్సిడీతో కలిపి రూ.1,116 లకు విక్రయిస్తున్నామన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌ను తీసుకుని రైతు ఆగ్రో సేవా కేంద్రాలకు వెళ్లి జీలుగ విత్తనాలను పొందొచ్చని తెలిపారు.

రాముకు ఘన నివాళి



వనపర్తి టౌన్: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి డి.రాము వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 30 ఏళ్ల పాటు కార్మిక ఉద్యమాల్లో పని చేసి, కార్మికులకు అండగా ఉన్న రాము సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన స్తంభాలు



కోడేరు: మండల కేంద్రంతో పాటు నాగులపల్లి, నాగులపల్లితండాపాటు పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగాయి. కోడేరు, జనుంపల్లి, తీగలపల్లి, కొండ్రావుపల్లి, పస్పులలో మామిడి కాయలు రాలిపోయాయి. నాగులపల్లితండాలో భారీ చెట్టు విరిగి పడిపోవడంతో మూడు విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ రేకులు ఎగిరిలేచి కిందపడ్డాయని మాజీ సర్పంచ్ ఝాన్సి తెలిపారు.

ముమ్మరంగా మామిడి తోటల కటింగ్

పెద్దకొత్తపల్లి: మామిడి తోటలలో కాయలు కోసిన అనంతరం రైతులు తోటల కటింగ్‌ను ప్రారంభించారు. వర్షాలు కురువక ముందే రైతులు మామిడి చెట్లను కత్తిరించి కొమ్మలు తొలగించి చెట్లకు పాదులు చేసి ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు తోటల పనులను ప్రారంభించారు. మామిడి తోటలను కటింగ్ కోసం కడప జిల్లా నుంచి కూలీలు వచ్చి కత్తిరింపులు మొదలు పెట్టారు. మండలంలో 25 వేల ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. రైతులు తోటల పనుల్లో నిమగ్నం అయ్యారు.

సైబర్‌నేరాలపై అవగాహన



పెంట్లవెల్లి: గుర్తుతెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు పోలీస్‌స్టేషన్‌లో నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామన్‌గౌడ్, జమీందార్ రాజేందర్‌గౌడ్, హారిక, మహేష్‌లు పాల్గొన్నారు.

కుష్టుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మానవపాడు: కుష్టువ్యాధి ఒక సామాన్యమైన వ్యాధిని, చర్మంపై గోధుమవర్ణంలో మొద్దుబారిన మచ్చలు వస్తాయని, ఇవి గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో చికిత్స తీసుకోవాలని డీపీఎమ్‌ఓ మల్లికార్జున్, డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎమ్‌లు,, ఆశలతో లెప్రసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలలో లెప్రసీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌మ్‌లు, ఆశలు ఇంటింటికి వెళ్లి లెప్రసీ వ్యాధి గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రారంభ దశలో గుర్తించి, మందులు 6నెలల నుంచి 12నెలలు పూర్తిగా వాడితే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. కుష్ఠు, క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యనారాయణ, చంద్రన్న, సంధ్య, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎన్ఎమ్‌లు, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగం.. ప్రాణాపాయం



బండపల్లి సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు (ఫైల్)



దావాజిపల్లి సమీపంలో ప్రమాదకర మలుపు

- మలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు
- ఏడాదిలో 10 మంది మృతి

పాన్‌గల్: వాహనదారుల నిర్లక్ష్య డ్రైవింగ్, మితిమీరిన వేగం కారణంగా నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదం జరుగుతోంది. ఏడాదిలో వనపర్తి నుంచి పాన్‌గల్, కొల్లాపూర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాలే ఇందుకు కారణం. మృతిచెందిన వారిలో యువకులే అధికంగా ఉన్నారు. ప్రమాదాలను కళ్లారా చూస్తున్నా వారి డ్రైవింగ్‌లో వేగం మాత్రం అదుపు చేసుకోవట్లేదు. రెండు వరుసల రోడ్డు కలిగి, ప్రమాదభరిత మలుపులున్న ఈ రహదారిపై పూర్తిస్థాయి అవగాహన లేనివారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడాది కాలంలో పాన్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పది మంది రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రుల సంఖ్య కూడా పదుల సంఖ్యలో ఉండడం ఆందోళన కలిగిస్తుంది.

45 కిలోమీటర్ల దూరం..

వనపర్తి నుంచి పాన్‌గల్ మీదుగా కొల్లాపూర్ 45 కి.మీ. దూరంలో ఉంటుంది. గతంలో ఒకే వరుసగా ఉన్న ఈ రోడ్డును నియోజకవర్గాల అనుసంధానంలో భాగంగా రెండు వరుసలుగా అభివృద్ధి చేశారు. కానీ ఈ రూట్‌లో లెక్కకు మించిన మలుపులు ఉండడంతో ప్రమాదాల శాతం పెరిగింది. మలుపు ఉన్న చోట సంబంధిత శాఖ అధికారులు సూచికలు బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. మరి కొన్ని చోట్ల సూచికబోర్డులు లేకపోవడం కూడా దగ్గరికి వచ్చే వరకు మలుపు ఉన్నట్లు తెలియకపోవడం ప్రమాదాలకు కారణం అవుతుంది.

పాన్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఒక్కో చోట ఒకరు చొప్పున మృతి చెందారు. దావాజిపల్లి, అన్నారం, గోప్లాపూర్, వెంగళాయిపల్లి, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల శివారులో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

మండలంలో జరిగిన ప్రమాదాలు ఇలా..

- జనవరిలో బండపల్లి స్టేజీ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులు ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో మహేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. గౌతం, ఆంజనేయులకు తీవ్ర గాయాలయ్యాయి.
- 2023 డిసెంబర్ 19న మండలంలోని అన్నారం తండా సమీపంలో కోళ్ల డీసీఎం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో దావాజిపల్లికి చెందిన ఇద్దరు యువకులు గడ్డం శివ, గడ్డం రాంబాబు మృతి చెందారు.
- 2023 నవంబర్ 26న దావాజిపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో జమ్మాపూర్ గ్రామానికి చెందిన బోయినిరాజు మృతి చెందాడు.
- 2023 నవంబర్ 23న అన్నారంతండా శివారులో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అన్నారం గ్రామానికి చెందిన బాలపీరు మృతి చెందాడు.
- 2023 ఆగస్టు 3న కేతేపల్లి శివారులో మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొన్న ఘటనలో పదర మండలానికి చెందిన డీసీఎం డ్రైవర్ ఎడుపుల మహేష్ మృతిచెందాడు.

యువతకు అవగాహన కల్పించాలి



రోడ్డు నిబంధనలు, డ్రైవింగ్ విషయంలో యువతకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి. వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తగా నడిపితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. ద్విచక్ర వాహనాదారులు తప్పక హెల్మెట్ ధరించాలి. నిబంధనలను పాటించని వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.

– బాల్యానాయక్, సీపీఎం జిల్లా నాయకులు, తెల్లరాళ్లపల్లితండా

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంగా వెళ్లడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పిల్లలకు వాహనాలు ఇవ్వకపోవడం, డ్రైవింగ్ విషయంలో తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాలి.

– వేణు, ఎస్‌ఐ, పాన్‌గల్

అధ్వానంగా ప్రాజెక్టు రహదారి



జూరాల ప్రాజెక్టు రహదారిపై ఏర్పడ్డ గుంతలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై గల బీటీ రహదారి అధ్వానంగా మారినా సంబంధిత ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవడం లేదు. జూరాల ప్రాజెక్టు పైనుంచి జోగులాంబ గద్వాల జిల్లాకు రహదారి సౌకర్యం ఉండడంతో ప్రాజెక్టుపై వందలాది వాహనాలు రాకపోకలను కొనసాగిస్తుంటాయి. ఈ క్రమంలో బీటీ రహదారి దెబ్బతిని గుంతలమయమవుతున్నా అధికారులు స్పందించకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాకే వరప్రదాయిని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారికి మరమ్మతు చేయడంలో ప్రభుత్వం చొరవచూపకపోవడం శోచనీయం అని ప్రాజెక్టు సందర్శన కోసం వస్తున్న పర్యాటకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

భర్తపై చర్య తీసుకోవాలంటూ భార్య ఫిర్యాదు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వైష్ణవికి మూడేళ్ల క్రితం జోగులాంబ జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డికి చెందిన భీమార్జున్‌తో వివాహం జరిగింది. వీరికి 4నెలల బాబు ఉన్నాడు. కొంతకాలంగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వైష్ణవి తల్లిగారి ఇంట్లో ఉంటోంది. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడటంతో వైష్ణవి కుమారుడితో కలిసి మంగళవారం భర్త ఇంటికి వెళ్లింది. ఇంటికి వచ్చిన వైష్ణవికి ఇంట్లో భర్త లేకపోవడంతో పాటు ఆడపడుచు మాత్రమే ఇంట్లో కనిపించింది. భర్త భీమార్జున్‌కు ఫోన్ చేయడంతో అతడు స్పందిస్తూ.. నీవు అవసరం లేదు కోర్టులో కేసు పెట్టాను నీవు మీ ఇంటికి వెళ్లిపో అని సమాధానం చెప్పినట్టు వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ వైష్ణవి భర్త భీమార్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోపాల్‌పేట: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌లు, పనిముట్లకు రోజువారీగా రూ.20 చొప్పున ఇవ్వాలని, కూలీలు పనులు చేసే ప్రదేశం తగిన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆర్డీఓ నాగేంద్రం కు వినతిపత్రం అందించారు. ఇటీవల పాలికెపాడులో వడదెబ్బతో మరణించిన బంగారమ్మకు వెంటనే పరిహారం చెల్లించాలని, శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లికి చెందిన గోవిందమ్మ ఉపాధి పనిచేస్తుండగా కాలు విరిగిందని, ఆస్పత్రి ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని, గోవిందమ్మ కోలుకున్నంతవరకు రోజువారీ మస్టర్ రాయాలని కోరారు. దత్తాయపల్లిలో ఉపాధి పనులు చేసిన వారికి పోస్టాఫీస్ వారు రెండు నెలలుగా కూలీ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

క్రీడా ప్రాంగణాల తనిఖీ

మానవపాడు: మద్దూరు, కలుకుంట్ల, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి క్రీడా ప్రాంగణాలను, వైకుంఠదామం, నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు క్రీడా ప్రాంగణాలను యువతకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

సాంకేతిక విప్లవ పితామహుడు రాజీవ్‌గాంధీ



అమరచింతలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్

వనపర్తి టౌన్: దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి. శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మూడు గ్రూపులుగా విడిపోయి నిర్వహించారు. నందిహిల్స్‌లోని ఎమ్మెల్యే నివాసంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ఆధ్వర్యంలో, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయం ఎదుట, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి పునాది వేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, లక్కాకుల సతీష్, దేవుజ్యానాయక్, కోట్ల రవి, సత్యారెడ్డి, కొంకి వెంకటేష్, ఖమ్మర్ మియా, కృష్ణ, దివాకర్‌యాదవ్, రోహిత్, జానకీరాములు, బ్రహ్మం, వెంకటస్వామి, సత్యనారాయణ, మన్యం, హరీష్, షకిల్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీను, మనివర్ధన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, నాగేష్, గోపాల్, దస్తగిరి, పోషన్న, సాయిరాఘవ తదితరులు ఉన్నారు.

అమరచింత: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనలో నేటితరం యువకులు పయనించాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, తిరుమలేష్, పోషిరిగారి విష్ణు, హన్మంత్‌నాయక్, నాగునాయక్, పోతు శ్రీదర్, శ్యాం, విజయ్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాగేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, క్యామ రాజు, లింగస్వామి, జయాకర్, బాబన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జెల నాగన్న ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, జగదీశ్, హనుమాన్‌రావు, అక్కల మహదేవన్‌గౌడ్, ఖాజమైనోద్దీన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, సుధాకర్‌రావు, కొంకి వెంకటేష్, కొంకి రమేష్, జానకీరాం, యాదగిరి పాల్గొన్నారు.



మదనాపురంలో..



డీసీసీ కార్యాలయం ఎదుట



జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో

క్షయ నివారణపై అవగాహన



కదిరెపాడులో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్, కదిరెపాడు గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించి అనుమానిత వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసి అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం శ్లేనను సేకరించినట్లు వారు తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిల్వ నీటితో దోమలు వ్యాప్తి చెంది వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, బోధకాల వంటి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



ఒండ్రు మట్టి తరలింపు పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: ఎండల తీవ్రత మూలంగా నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంరక్షించాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు దావత్‌ఖాన్‌పల్లి నర్సరీలో పెంచిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నర్సరీ మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలన్నారు. దావాత్‌ఖాన్‌పల్లిలోని చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులను ఆయన పరిశీలించారు. పనులకు వచ్చే రోజు వారీ కూలీల సంఖ్యను పెంచాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పనుల వద్ద నీడ, నీటి వసతిని తప్పక ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



నందకిషోర్ (ఫైల్)

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నందకిషోర్ మూడు రోజులుగా కనిపించడం లేదంటూ అతడి భార్య చిట్టి కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చింతరేవుల గ్రామానికి చెందిన నందకిషోర్‌కు పెబ్బేరు మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన చిట్టితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతుండడంతో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి సర్దిచెప్పారు. ఊర్లో ఉంటే గొడవలు అయితాయని చెప్పి 10రోజుల క్రితం కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన రాజు అనే గొర్రెల యజమాని వద్ద గొర్రెలు కాసేందుకు జీతం కుదుర్చుకున్నాడు. ఈనెల 17న నందకిషోర్ గొర్రెల మేపడానికి వెళ్తున్నా అని భార్య చిట్టితో చెప్పి వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో అనుమానం వచ్చి నందకిషోర్ భార్య చిట్టి మంగళవారం కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అమరచింతలో లోపించిన పారిశుద్ధ్యం



పట్టణంలోని కాళికామాత ఆలయం ఆవరణలో నిలిచిన మురుగు



కట్టెల మిషన్ సమీపంలో ప్రధాన రహదారిపై తాగునీటి పైప్‌లైన్ లీకేజీ

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ నీటితో రహదారులు దెబ్బతింటుండడంతో పాటు మురుగు డ్రెయినేజీలకు వెళ్లకుండా రహదారులపై నిల్వ ఉండటంతో వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించి పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పట్టణంలోని కొత్త బస్టాండ్‌తో పాటు మాదన్న కట్టెల మిషన్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడినా అధికారులు మరమ్మతు పనులు చేపట్టట్లేదు. వీటితో పాటు జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలోని ఓవర్ హెడ్ ట్యాంక్, దశమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు నిండి నీరు వృథాగా పారుతుండటంతో మరికల్, ఆత్మకూర్ ప్రధాన బీటీ రహదారి గుంతలమయంగా మారుతోంది. శ్రీకృష్ణనగర్‌లోని కాళీకాలయం ఆవరణంలో మురుగుకాల్వల నీరు నిల్వ ఉండి పరిసరం దుర్గంధంగా తయారయిందని ఆలయానికి వస్తున్న భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలతో పాటు మురుగు రహదారులపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లోతు దుక్కులతో ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహ ఆధ్వర్యంలో లోతు దుక్కులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతులు రబీ పంటలు కోయగానే పొలాన్ని అలాగే వదిలేసి తొలకరి జల్లులు కురిసిన తర్వాత ఖరీఫ్ కోసం దుక్కులు దున్నడం మొదలుపెడతారని, దీనివల్ల దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వేసవిలోనే లోతు దుక్కులు దున్నుకోవడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. వేసవిలో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. లోతుగా దున్నడం వల్ల లోతైన పొరల నుంచి నీరు ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. భూమిపై పడిన ప్రతి వర్షపు బిందువు అక్కడికక్కడే ఇంకి నీరు పరిరక్షించబడుతుందని తెలిపారు. వర్షాధార పంటలు కీలక దశల్లో బెట్టకు గురైనప్పుడు లేదా తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు పంట వేర్లు లోపలికి పోవడం వల్ల నేల లోపలి పొరల్లోని తేమను, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తిని చేకూరుతుందన్నారు. భూమి లోపలి పొరల్లోని మట్టి పైకి, భూమి పైమట్టి లోపలి పొరల్లోకి కలిసి పోవడం ద్వారా భూసారం సమానంగా మొక్కలకు అందడంతో అధిగ దిగుబడి వస్తుందన్నారు. ప్రతి రైతు వేసవిలో దుక్కులు దున్నాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

రోడెక్కిన రైలింజన్



అడ్డాకుల: మండలపరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారి గుండా మంగళవారం లారీపై రైలింజన్‌ను తీసుకెళ్తున్న దృశ్యం ప్రయాణికుల దృష్టిని ఆకర్షించింది. బెంగళూర్ నుంచి పంజాబ్‌కు రైలింజన్‌ను తరలిస్తూ మార్గమధ్యలో మంగళవారం ఉదయం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద లారీని రోడ్డు పక్కన కొద్దిసేపు నిలిపారు. ఈ సమయంలో టోల్‌ప్లాజా దాటి వెళ్లే వాహనదారులు కొద్దిసేపు తమ వాహనాలను నిలిపి రైలింజన్‌ను ఆసక్తిగా గమనించారు. తమ ఫోన్లలతో రైలింజన్ చిత్రాలను బంధించారు.